


బంబడుగూడలో మలేరియాతో బాధపడుతున్న శ్రావణి

అమ్మో మలేరియా!

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- సీజన్‌కు ముందే ప్రబలుతున్న వైనం
- మంచం పట్టిన గిరిజన గ్రామాలు
- ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి
- పీహెచ్‌సీల్లో అందుబాటులో లేని మందులు
- గిరిజనులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో మలేరియా విజృంభిస్తోంది. ఏ గిరిజన గ్రామం చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. పదుల సంఖ్యలో గ్రామస్థులు, చిన్నారులు మంచం పట్టారు. రోజురోజుకూ పాజిటివ్ కేసులు పెరుగుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులు , గిరిజన గ్రామాల్లో పారిశుధ్య లోపం వంటి కారణాలతో అపెడమిక్ సీజన్ కంటే ముందే మలేరియా చాపకింద నీరులా విస్తరిస్తోంది. సీతంపేట ఏరియా ఆసుపత్రికి రోజుకి 10 నుంచి 15 పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నా యంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత నెలలో 110 కేసులు రాగా.. ఈనెలలో ఇప్పటివరకు 36 మందికి పాజిటివ్‌గా నిర్ధారించారు. ఇక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించే జ్వరపీడితుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది.

పీహెచ్‌సీల పరిధిలో..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పది పీహెచ్‌సీల్లో మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రధానంగా దోనుబాయి, మర్రిపాడు, కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో మలేరియా వ్యాధిగ్రస్థులు రోజురోజుకూ పెరుగుతున్నారు. పెదరామ పంచాయతీ పరిధి బంబడుగూడ గిరిజన గ్రామంలో ఒకే ఇంటిలో సవర శ్రావణి,సవర శ్రావత అనే చిన్నారులు మలేరియాతో మంచం పట్టారు. వారితో పాటు గ్రామంలోని సవర శ్యామలరావు, రాణి, సుమలత, సుస్మితలు కూడా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆశా వర్కర్ సవర మంగమ్మ ఆర్‌టీ కిట్స్ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించగా వారికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అదే గ్రామానికి చెందిన సవర నరేష్ సీతంపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు.

వేధిస్తున్న మందుల కొరత

ఏజెన్సీలోని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో మలేరియా మందులు (మిగతా 8వ పేజీలో...)


సీతంపేట ఏరియా ఆసుపత్రిలో మలేరియా రోగులతో నిండిన బెడ్లు




పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న మర్రిపాడు పీహెచ్‌సీ

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఏమన్నారంటే..

'సీతంపేట ఏజెన్సీ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల్లో మలేరియా మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.' అని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి తెలిపారు.

పారిశుధ్య లోపం..


పదుల సంఖ్యలో జ్వరపీడితులున్న బంబడుగూడ గ్రామం

పంచాయతీ, సచివాలయ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గిరిజన గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్తా చెదారాలే దర్శనమిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఎంతోమంది గిరిజనులు మలేరియా బారిన పడుతున్నారు. వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్ వంటివి ముందస్తుగా చేపట్టాల్సి ఉంది. లేకుంటే వ్యాధులు మరింత ప్రబలే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

సీతంపేట ఏరియా ఆసుపత్రి కిటకిట

జ్వరపీడితులతో మంగళవారం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో బెడ్‌లన్నీ నిండిపోయాయి. వాస్తవంగా 100 పడకల ఏరియా ఆసుపత్రిలో మొత్తంగా 65 బెడ్‌లు వినియోగంలో ఉన్నాయి. అయితే మలేరియా రోగులు ఎక్కువగా చేరడంతో మంచాలు ఖాళీలేవు. ఇతరాత్ర అనారోగ్య సమస్యలతో వస్తున్న వారికి వైద్య సిబ్బంది పరీక్షించి ఇంటికి పంపించేస్తున్నారు.



పర్యవేక్షణ లేక.. అభివృద్ధికి నోచక..

- ప్రముఖ ఆలయాలపై దేవదాయ శాఖ శీతకన్ను
- తోటపల్లి దేవస్థానానికి ఇన్‌చార్జి ఈవోనే దిక్కు
- దాతల సాయంతోనే ఆలయ పునర్నిర్మాణ పనులు
- శిథిలావస్థలోనే సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గదులు
- ఆస్తులున్నా.. పట్టించుకునే వారేరీ?
- ఉన్నతాధికారులు స్పందించాలని భక్తుల వేడుకోలు

పార్వతీపురం, మే6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ ఆలయాలపై దేవదాయ శాఖ పర్యవేక్షణ కొరవడింది. దీంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆస్తులున్నా.. కొన్ని దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. జిల్లాలో చినతిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి దేవస్థానం విషయానికొస్తే.. దీనిని 1972, జనవరి 26న నిర్మించారు. ఇక్కడున్న వేంకటేశ్వర స్వామి, కోదండ రామిస్వామి దేవాలయాలు నిత్యం భక్తులతో కిటకిటలాడేవి. ఈ ప్రాంగణంలోనే వివాహాలు జరిపించేవారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తలనీలాలు సమర్పించి.. నాగావళి నది స్నాన మాచరించి స్వామిని దర్శించుకునే వారు. అనంతరం పూజలు చేసి మొక్కులు చెల్లించుకునే వారు. అయితే ఇంతటి ప్రాముఖ్యత కలిగిన తోటపల్లి దేవస్థానంపై దేవదాయ శాఖ శీతకన్ను వేసింది. ఆలయాల నిర్వహణను పట్టించు కోవడం మానేసింది. గత రెండేళ్లుగా ఇన్‌చార్జి ఈవోతోనే నెట్టుకొస్తున్నారు. పాలకొండ కోటదుర్గమ్మ ఆలయానికి రెగ్యులర్ ఈవోగా ఉన్న వీవీ సూర్యనారాయణ శంబర పోలమాంబ ఆలయం, దాని పరిధిలో రెండు ఉప ఆలయాలు, తోటపల్లి దేవస్థానానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది.


పార్వతీపురంలో సత్యనారాయణస్వామి ఆలయం

తోటపల్లి దేవస్థానం భూములు ఇలా..

తోటపల్లి దేవస్థానానికి చెందిన ఏడు ఎకరాల 40 సెంట్లను లీజుకు ఇవ్వడంతో ఏడాదికి రూ.36,750 ఆదాయం వస్తుంది. మరో ఐదు ఎకరాల 91 సెంట్ల భూమి ఆలయాల సమీపంలోనే ఉంది. కాగా 81 సెంట్లు తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలోకి వెళ్లిపోయింది. దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో దేవదాయశాఖకు సొమ్ము రాకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు.

దాతలే పెద్దదిక్కుగా..

తోటపల్లి దేవస్థానానికి దాతలే పెద్ద దిక్కుగా మారారు. తోటపల్లిలో ఉభయ దేవాలయాల పునర్నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.85 లక్షలు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులేమీ కేటాయించలేదు. కానీ దాతలు మాత్రం ఇప్పటివరకు రూ.2కోట్లపైనే ఇచ్చారు. వారి సహకారంతోనే దేవాలయాల్లో కార్యక్రమాలు జరుగుతున్నాయి. దేవదాయ శాఖ పూర్తిగా పట్టించుకోకపోవడంతో విరాళాలు సేకరించి.. ప్రాకర మండపం, రాజగోపురం, షాపింగ్ కాంప్లెక్స్ వినాయక, సరస్వతిదేవి ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు అన్నదాన మండపం వంటివి నిర్మించారు.

జిల్లా కేంద్రంలో ఇలా..

జిల్లా కేంద్రం పార్వతీపురంలో సత్యనారాయణస్వామి ఆలయం పరిస్థితి దయనీయంగా మారింది. దీనిపై కూడా దేవదాయ శాఖ పర్యవేక్షణ కొరవడింది. ఆ ఆలయానికి సంబంధించి సుమారు 30 ఎకరాల 27 సెంట్లు భూములు ఉన్నాయి. కొమరాడ మండలం (మిగతా 8వ పేజీలో...)


సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గదులు ఇలా..

వస్త్ర దుకాణంలో
అగ్నిప్రమాదం

- విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు
- రూ.లక్షల విలువైన దుస్తులు దగ్ధం

పార్వతీపురం టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం ప్రధాన రహదారిలోని ఓ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల నివాసితులు, వివిధ షాపుల వారు అగ్నిమాపకశాఖాధికారులకు సమాచారం అందించారు. వెంటనే జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సుమారు రూ.50 లక్షలు విలువ చేసే దుస్తులు అగ్నికి ఆహుతి అయినట్లు యజమాని తెలిపారు. కాగా అగ్నిమాపక అధికారి మాత్రం రూ25 లక్షల వరకు ఆస్తినష్టం జరగొచ్చని అంచనా వేశారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుస్తులు

బంగారం ఎంతుందేటి?

- పది గ్రాముల ధర దాదాపు రూ.లక్ష
- అయినా తగ్గని డిమాండ్
- బంగారు నిల్వలకూ ఉన్నాయి పరిమితులు

6లో




మామిడిపల్లి వద్ద రోడ్డుపై మొక్కజొన్నను ఎండబెట్టిన దృశ్యం

మొక్కజొన్న ధర పతనం

- క్వింటాకు రూ.250 వరకు తగ్గింపు
- ఆవేదనలో రైతులు

సాలూరు రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట ధర తగ్గింది. క్వింటాకు రూ.250 వరకు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో పంటను దాచుకోలేక, అమ్ముకోలేక సతమతమవుతున్నారు. జిల్లాలోని 15 మండ లాల్లో మొత్తం 21,572 ఎకరాల్లో పంట సాగైంది. అందులో 4 వేల ఎకరాలు విత్తన మొక్కజొన్న, 8,572 ఎకరాల్లో సాధారణ మొక్కజొన్నను సాగు చేశారు. దాదాపు 30 వేల టన్నుల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం క్వింటా మొక్క జొన్న ధర రూ.2,225గా నిర్ణయించింది. అయితే ప్రైవేట్ వర్తకులు అంత కంటే అధిక ధరకే కొనుగోలు చేసేవారు. కొద్దిరోజుల కిందట వరకు క్వింటాకు రూ.2,600 వరకు ఇచ్చేవారు. అయితే ఇటీవల గుంటూరు ప్రాంతంలో మొక్కజొన్న దిగుబడి అధికంగా రావడంతో ధర తగ్గించారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బతినడం, ఇతర ప్రాంతాల్లో దిగుబడి వల్ల ప్రస్తుతం సాలూరు ప్రాంతంలో వ్యాపారులు క్వింటా మొక్కజొన్నను రూ. 2,300 నుంచి రూ.2,350 కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే మిల్లులకు పంపిన పంటకు సంబంధించి వర్తకులు పేమెంట్లు జాప్యం చేస్తుండడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

తోటపల్లి సమీపంలోనే ఏనుగుల సంచారం

గరుగుబిల్లి, మే6 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి నుంచి గజరాజుల కదలడం లేదు. మంగళవారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న షామిల్లులో తిష్ట వేశాయి. అయితే దానికి సమీపంలోనే తోటపల్లి దేవాలయాలు ఉన్నాయి. దీంతో అవి ఏ నిమిషంలో దేవస్థానాల వైపు వస్తాయోనని భక్తులు, స్థానికులు తీవ్ర ఆందోళన చెందారు. రహదారికి పైకి వస్తే పరిస్థితేమిటోనని వాహనదారులు బెంబేలెత్తిపోయారు. అయితే కొద్దిసేపటి తర్వాత ఏనుగులు సమీప పామాయిల్ తోటల్లోకి వెళ్లిపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.


తోటపల్లిలో సంచరిస్తున్న గజరాజులు

సిరి సంబరం

- ఘనంగా కంతపోలమ్మ జాతర
- దాడితల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

6లో

రైతులకు అండగా..

- అన్నదాతా సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్
- ఈనెలలోనే ఖాతాల్లోకి నిధులు

6లో

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సంధ్యారాణి

8లో

నూతన రేషన్ కార్డుల జారీకి
రంగం సిద్ధం

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- చేర్పులు, మార్పులకు అవకాశం
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



పార్వతీపురం, మే6 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నేటి నుంచి కొత్త కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రకటించింది. సభ్యుల చేరిక, స్ప్లిట్, చిరునామా మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. నెల రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని వెల్లడించింది. జిల్లాలో ప్రస్తుతం 2,81,251 వరకు రేషన్ కార్డులున్నాయి. వాటిల్లో 55,939 ఏఏవై కార్డులున్నాయి. 2,25,312 డబ్ల్యూఏపీ కార్డులున్నాయి. కాగా ఇప్పటికే సుమారు ఐదు వేల మందికి పైబడి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కార్డుల జారీ ప్రక్రియ జరగలేదు. దీంతో ఐదేళ్ల నుంచి ఎంతో మంది దరఖాస్తులు చేసు కుని వాటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 'మన్యం' వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రాజేశ్వరి తెలిపారు. ఈకేవైసీ కార్యక్రమం 93 శాతం పూర్తయిందన్నారు.

ఆరోగ్య సమస్యలు తలెత్తరాదు: డీఎంహెచ్‌వో

పార్వతీపురం, మే6(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. మంగళవారం కొమరాడ మండలం కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యసేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ఆశాడే అజెండా అంశాలపై సమీక్షించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో వయసుకు తగ్గట్టుగా ఎదుగుదల తీరును గమనించాలన్నారు. ఏమైనా లోపాలు, వ్యాధులను గుర్తిస్తే జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి రిఫర్ చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సర్వే వివరాలు పక్కాగా నివేదించాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే పారదర్శకంగా చేపట్టి దీర్ఘకాలిక రోగులను గుర్తించాలని సూచించారు.


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

బంగారం ఎంతుండేటి?





- పది గ్రాముల ధర దాదాపు రూ.లక్ష
- అయినా తగ్గని డిమాండ్
- బంగారు నిల్వలకూ ఉన్నాయి పరిమితులు

రాజాం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): బంగారం.. ఈ పేరు చెబితే మహిళలే గుర్తుకువస్తారు. ఎందుకంటే బంగారంపై మక్కువ చూపేది ఎక్కువగా వారే కాబట్టి. పురుషుల్లోనూ బంగారం ప్రియులు ఉన్నారండోయ్. చేతుల వేళ్ల నిండా ఉంగరాలు...మెడలో పెద్ద పెద్ద గొలుసులతో అక్కడక్కడా మనకు బంగారుబాబులు కనిపిస్తుంటారు. ఎవరి దగ్గర ఎలాంటి వెరైటీ ఆభరణాలు ఉన్నాయో తెలుసుకోవాలంటే... మన చుట్టూ జరిగే వివాహ వేడుకలు వెళితేసరి. అన్నట్టు వీటిలో వన్‌గ్రామ్ ఆభరణాలూ ఉంటున్నాయి...అది వేరే సంగతి. ఉమ్మడి జిల్లాలో బంగారానికి డిమాండ్ ఎక్కువే. అసలే పెళ్లిళ్ల కాలం. దీంతో బంగారం షాపులూ కళకళలాడుతున్నాయి. డిమాండ్ పెరగడంతో దీని ధర కూడా ఆకాశం వైపు దూసుకుపోతోంది. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరింది. అయినా వీటి అమ్మకాలు తగ్గడం లేదు. బంగారంపై పెట్టుబడి పెడితే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందనే భరోసానే దీనికి కారణం. దీంతో ధనవంతులతో పాటు సాధారణ, మధ్య తరగతి వారు కూడా తమ స్థోమతను బట్టి బంగారం కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.

ఎంత ఉండాలంటే...

భవిష్యత్ అవసరాల కోసం బంగారంపై పెట్టుబడి పెట్టే విషయాన్ని పక్కన పెడితే.. చట్టప్రకారం ఓ వ్యక్తి వద్ద ఎంత బంగారం ఉండొచ్చనే విషయం చాలామందికి తెలియదు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం వ్యక్తుల వద్ద ఉండే బంగారానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని... ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు ఫిర్యాదులందినా.. అనుమానంతో ఆదాయ పన్ను అధికారులు సోదాలు చేసినా.. పరిమితికి మించి బంగారం ఉంటే సరైన ఆధారాలను మనం చూపించాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులైతే రిటర్న్‌లో కూడా బంగారం వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. చట్టం ప్రకారం మహిళలు, పురుషులు బంగారం సమానంగా కలిగి ఉండడానికి అవకాశం లేదు. పెళ్లయిన మహిళల వద్ద 500 గ్రాములు (సుమారుగా 43 తులాలు)... పెళ్లికాని మహిళల వద్ద 250 గ్రాములు (21.50 తులాలు) వరకు ఉండొచ్చును. అదే పురుషులైతే వివాహమైనా... కాకపోయినా 100 గ్రాములు (8.5 తులాలు) వరకు ఉండొచ్చును. స్త్రీ, పురుషులిద్దరూ అంతకు మించి బంగారం కలిగి ఉంటే అదనంగా ఉన్న సొత్తుకు సంబంధించి సరైన పత్రాలను అధికారులకు చూపించాలి. లేకపోతే అదనంగా ఉన్న బంగారాన్ని జప్తు చేసే అధికారం ఆదాయ పన్ను శాఖ అధికారులకు ఉంటుంది.



రాజాంలో వినియోగదారులతో కిటకిటలాడుతున్న బంగారం దుకాణం

మంత్రి లోకేష్‌ను కలిసిన జిల్లా నేతలు





మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే అదితి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

విజయనగరం రూరల్/చీపురుపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్‌ను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం అమరావతిలో కలిశారు. సింహాచలేశుని చందనోత్సవానికి వినియోగించిన చందనం, స్వామి వారి ప్రసాదాన్ని అందించారు. అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అమరావతిలో మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీసీసీబీ చైర్మన్‌గా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

విద్యల నగరంలో బాల మేధావి

విజయనగరం దాసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థి గరుగుబిల్లి కూనల్ అసమాన ప్రతిభ కనబరుస్తున్నాడు. కష్టసాధ్యమైన జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్ ప్రశ్నలకు అలవోకగా సమాధానం చెబుతున్నాడు. 140కి పైగా దేశాలకు సంబంధించిన జాతీయ పతకాలను అవలీలగా గుర్తుపట్టి చెబుతున్నాడు. వందకు పైగా దేశాల సమాచారాన్ని సముద్రాలు, ఖండాలు, చారిత్రక యుద్ధాలు, ప్రదేశాలు, రాజధానులు వంటి అంశాలను అడిగిన వెంటనే చెప్పి అబ్బురపరుస్తున్నాడు. మంగళవారం గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో కూనల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సముద్రాల గురుప్రసాద్, సుభద్రాదేవి, గిరిజా ప్రసన్న, చంద్రశేఖర్, తల్లిదండ్రులు అశోక్, రాజులమ్మ పాల్గొన్నారు.



కూనల్ అభినందిస్తున్న ప్రముఖులు

వైభవంగా సిరి సంబరం

- దాడితల్లి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న బళ్లు, జానపద వేషధారణలు

బొబ్బిలి/రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో మంగళవారం గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువ జామునుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గొల్లపల్లిలోని ప్రధాన, బైపాస్ రోడ్డులో గల అమ్మవారి ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిక్కిరిసిపోయాయి. సిరిమాను పైల వీధి దాడితల్లి అంగడి నుంచి సాయంత్రం ఏడు గంటలకు బయలు దేరింది. అనువంశిక పూజారి బత్తేన కృష్ణ వేద పండితులతో పూజలు ముగిసిన అనంతరం సిరిమాను అధిరోహించారు. సిరిమాను రథం రాజవంశీయులు, ఎమ్మెల్యే బేబీనాయన కొబ్బరికాయ కొట్టిన తర్వాత ఆనవాయితీ ప్రకారం తూర్పు దిక్కుకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చింది.అనంతరం కీడు రాయి దగ్గరికి మేళతాళాలతో ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున సిరిమానుపై చీరలు, కొబ్బరికాయలు, అరటి, మామిడి పళ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది తమ చంటి పిల్లలను సిరిమానుకు తాకించి చల్లగా కరుణించు తల్లీ అని మొక్కుకున్నారు. బళ్లవేషాలు, జానపద వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చారు. భక్తుల కోసం ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు పలు కూడళ్లలో మజ్జిగ, తాగు నీరు, అల్పాహారం ఏర్పాటుచేశాయి. డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్, నారాయణరావు ఆధ్వర్యంలో 300 మంది పోలీసు సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు. పట్టణంలోని వీధుల్లో భారీ పోలీస్ బందోబస్త్, రోప్ పార్టీ, వలంటీర్ల మధ్య సిరిమాను ఊరేగింపు కొనసాగింది.ఆకతాయిలు, జేబుదొంగలు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారు. ఈ ఏడాది అమ్మవారి సిరిమానోత్సవ బాధ్యతలను ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్దనరావు, వజ్జి రవికుమార్, సర్వసిద్ధి సాయి హేమంత్‌లు కలిసి నిర్వహించారు. కాగా బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

దర్శించుకున్న బొబ్బిలి రాజకుటుంబం

బొబ్బిలిలో దాడితల్లి అమ్మవారు సిరిమానోత్సవం పురస్కరించుకుని గొల్లపల్లిలో మంగళవారం సాయంత్రం రథం మానును మాజీ మంత్రి, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఆర్‌వీఎస్‌కే రంగారావు (సుజయ్ నాయన), ఆర్‌వీఆర్‌కే రంగారావు (రామునాయన), ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం బొబ్బిలి రాజ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి సన్నిధిలో రాజకుటుంబీకులు



సిరిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు



సిరిమానోత్సవంలో భక్తులను ఆశీర్వదిస్తున్న పూజారి

బగ్గందొరవలసలో..

సీతానగరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బగ్గందొరవలసలో వివిధ గ్రామాల ప్రజల ఇలవేల్పుగా పూజించే కంతపోలమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సోమవారం జాతర ప్రారంభం కాగా మంగళవారం సాయంత్రం పుర వీధుల్లో సిరిమానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, తిరువీధి ఉత్సవంతో పాటు భాజా భజంత్రీలు, పులివేషాలతో విన్యాసాలతో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. యువకులు వేసిన పులివేషాలు, బాలికల కోలాటం ఆకట్టుకున్నాయి. బుధవారం ఉదయం అనుపోత్సవం, మొక్కులు తీర్చు కోనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని పలు పురు రాజకీయ ప్రముఖులు, ప్రజా సంఘాల నేతలు దర్శించుకున్నారు.



అలంకరణల్లో..

భోగాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): గుడివాడలో గ్రామ దేవతలు ముత్యాలమ్మ, తోగాలమ్మ అమ్మవార్లకు మంళవారం కొబ్బరి, తాటికాయలు, ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చేసి విశేష పూజలు జరిపారు.



పైడిమాంబకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి బూరెలు, పండ్లు నైవేద్యం

విజయనగరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): వైశాఖమాసం మంగళవారం కావడంతో ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ చదురుగుడి, వనంగుడుల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం దర్శనం కల్పించారు. నగరంతో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పైడిమాంబను దర్శించుకున్నారు. మామిడి పండ్లను, బూరెలను నైవేద్యంగా సమర్పించారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలకరించారు.



పైడిమాంబ దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న పీడీ షేక్ రుక్సానా సుల్తాన్ బేగం


బాల్యవివాహాల నివారణకు కమిటీలు

- గ్రామస్థాయిలో 11మందితో నియామకం
- ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తాన్ బేగం

రామభద్రపురం, మే 6(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు నివారించేందుకు గ్రామస్థాయిలో 11 మందితో కమిటీలు వేశామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తాన్ బేగం తెలిపారు. మండల పరిధిలోని బూసాయవలస అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర్ బాలికలతో ఆమె మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా జీవో నెంబరు 39 ప్రకారం బాల్య వివాహాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ చైర్‌పర్సన్‌గా 11 మంది సభ్యులను నియమించి ఒకటి, మూడో శుక్రవారాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. 2024-25 సంవత్సరంలో 25 మంది బాల్య వివాహాలు నిరోధించామని, వీరిలో కొంత మందిపై కేసులు కూడా నమోదు చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కిశోర బాలికలకు శారీరక దృఢత్వం, పౌష్టికాహారం, వేధింపులపై సూచనలు, సలహాలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 12 అంగన్‌వాడీ టీచర్లు, 67 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.లక్ష్మి, బాడంగి సీడీపీవో రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి పాల్గొన్నారు.

రైతులకు అండగా..

- అన్నదాతా సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్
- ఈనెలలోనే ఖాతాల్లోకి నిధులు
- కౌలు రైతులకూ వర్తింపు
- జాబితా తయారీలో వ్యవసాయశాఖ
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



రాజాం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా అన్నదాతా సుఖీభవ పథకం అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెలలోనే వర్తింపజేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అర్హులైన రైతులతో పాటు కౌలు రైతులకూ పథకం వర్తించేలా రూపకల్పన చేసింది. జిల్లాలో ఎంతమంది అర్హులు ఉన్నారో, ఏమేర నిధులు అవసరమో జిల్లా వ్యవసాయశాఖ గణాంకాలను సేకరిస్తోంది. కుటుంబం యూనిట్‌గా రైతుకు రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో సాయం అందించేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా అందుకున్న రైతుల జాబితాలను వడబోసి అర్హులకు డబ్బులు ఇచ్చేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పేరుతో రూ.6 వేలు ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మరో రూ.14 వేలు చేర్చి రూ.20 వేల వంతున అందించేలా చేస్తోంది. ఈనెలలోనే అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాలో సుమారు రెండు లక్షల మంది రైతులు, సుమారు 50 వేల మంది కౌలురైతులు అర్హులుగా ఉన్నట్లు తెలుస్తోంది.

కౌలురైతుల్లో ఆనందం..

రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రైతులతో పాటు కౌలురైతుల్లో కూడా ఆనందం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రకరకాల సాకులతో అర్హులను సైతం పక్కన పెట్టింది. దీంతో అర్హులైన వారు రైతుభరోసాను పొందలేకపోయారు. అలాంటి సమస్య తలెత్తకుండా ఎంత ఎక్కువమంది రైతులు, కౌలురైతులుంటే అందరినీ పరిగణనలోనికి తీసుకోవాలని, వారికి లబ్ధి చేకూర్చాలని తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

అధికారులకు ఆదేశాలు

నూతన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో తొలివిడత అన్నదాతా సుఖీభవ పథకం వర్తింపజేసేందుకు అర్హులైన రైతులు, కౌలురైతుల జాబితాలను తయారు చేయాలని వ్యవసాయశాఖాధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలను కూడా ఇచ్చింది. అర్హుల జాబితాలను వ్యవసాయశాఖ కమిషనర్ పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించింది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

పథకం అమలులో భాగంగా గ్రామస్థాయిలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, వీఆర్వోలు కీలకంగా వ్యవహరించనున్నారు. వీరిద్దరూ కలిసి లబ్దిదారుల ఎంపిక ప్రాథమికంగా చేస్తారు. ఈ జాబితాను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తే తహశీల్దార్, మండల వ్యవసాయశాఖాధికారి పరిశీలించి ఓకే చేయాల్సి ఉంటుంది. ఈ జాబితాలను జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించి వ్యవసాయశాఖ కమిషనర్ పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఫైనల్‌గా తయారైన జాబితా మేరకు రైతులు, కౌలు రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తుంది.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అన్నదాతా సుఖీభవ పథకం అమలుకు అర్హులైన రైతులు, కౌలు రైతుల జాబితాలను రూపొందిస్తాం. మండల వ్యవసాయశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిర్దేశించిన గడువులోగా అర్హులైన రైతుల జాబితాలను తయారుచేస్తాం.

- రామారావు, జిల్లా వ్యవసాయాధికారి

9న జిల్లా స్థాయి పోటీలు

లక్కవరపుకోట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారి గ్రామంలో సత్యవతమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పందెం, గుర్రపు పందెం, సీనియర్, జూనియర్ విభాగాల్లో 9న జిల్లాస్థాయి టాలెంట్ టెస్టు, కోలాట పందేలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గుమ్మడి సత్యనారాయణ, రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్టు విజేతలకు మొదటి పది మందికి వరుసగా రూ. వెయ్యి నుంచి 10 వేలు, గుర్రాలు, ఎడ్ల బండ్ల పోటీదారులకు రూ. 20వేలు బహుమతి అందజేయనున్నామని తెలిపారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

రాజాం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రెండు విడతలుగా నిర్వహించిన ఏపీ ఈసెట్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పరీక్షలకు 199 మంది విద్యార్థులకు గానూ 193 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 129 మందికి గానూ 125 మంది పరీక్షకు హాజరయ్యారు.

20న సమ్మెలో పాల్గొనండి

లక్కవరపుకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా 20న తలపెట్టిన సమ్మెలో ఆశా కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. మంగళవారం ఎల్.కోటలో సీఐటీయూ ఆధర్యంలో ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. జిల్లా నాయకులు గాడి అప్పారావు, మండల నాయకులు తరిణి వెంకటరమణ పాల్గొని ఆశా వర్కర్ల సమస్యలపై మాట్లాడారు. అనంతరం పీహెచ్‌సీ అధికారి బి.అనీల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గొల్లదేవి తదితరులు పాల్గొన్నారు.

●చీపురుపల్లి (గరివిడి): కోనూరు పీహెచ్‌సీ వైద్యులకు మంగళవారం ఆశా వర్కర్లు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు, ఆశా వర్కర్ల నాయకురాలు అనసూయ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

రాజాం, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డోలపేట చెక్ పోస్ట్ పక్కన నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ పాల్గొన్నారు. ఆయన వెంట పొట్నూరు లక్ష్మణరావు, శాసపు రమేశ్‌కుమార్, ఉమా, పిల్లా సత్యంనాయుడు, రవీంద్ర తదితరులున్నారు.

సమయపాలన పాటించండి

రాజాం, మే 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం బొద్దాం, పెనుబాక సచివాలయాలను ఆయన సందర్శించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మన మిత్రా వాట్సాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వారానికి రెండు రోజుల శిక్షణ

రాజాం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతీ సెక్టార్‌లో వారానికి రెండు రోజులు 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సూపర్‌వైజర్ కల్యాణి తెలిపారు. మంగళవారం పొగిరి సెక్టార్ పరిధిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలు పండించాలి

భోగాపురం, మే6(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ విధానంలో పంటలు పండించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లాల అధికారి ఆనందరావు అన్నారు. భోగాపురంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, రసాయనాల వాడకం వల్ల నేల పంటకు ప్రతికూలంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో నేల సారవంతం

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలు, పచ్చి రొట్ట ఎరువుల సాగుతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్‌టీవో ప్రకాశ్ తెలిపారు. మండలంలోని తంగుగుబిల్లిలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయ అధి కారి టి.సంగీత, మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ, ఏఈవో శ్యామ్‌కుమార్ ఉన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

చీపురుపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అకాల వర్షాలకు పంటలను కోల్పోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని జడ్పీ చెర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన పీకే పాలవలస పంచాయతీలోని కలిశెట్టిబడిలో దెబ్బతిన్న అరటి, బొప్పాయి పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో అమలైన పంటల బీమా పథకం ప్రస్తుతం వర్తించని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్ వైద్య విద్యార్థులు మంగళవారం నెల్లిమర్లలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మిమ్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, మిమ్స్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ సి.లక్ష్మీకుమార్, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు పయనం

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఇప్పుడిప్పుడే విధ్వంసం నుంచి వికాసం దిశగా పయనిస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొండలింగావలసలో సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. మంత్రి సొంత గ్రామం కావడంతో ఆమెకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ హయాంలో పంచాయతీలు విధ్వంసానికి గురయ్యాయన్నారు. ఐదేళ్ల జగన్ ఏలుబడిలో గ్రామాల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని విమర్శించారు. రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలకు నోచుకోక మారుమూల గ్రామాల వారు నరకయాతన అనుభవించారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. సాలూరు నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని 10 లక్షల్లో ఉద్యోగాలు త్వరలో ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ ద్వారా అన్నదాతలను ఆదుకుంటామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తల్లికి వందనం నిధులు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు ప్రవీణ్, గెద్ద అన్నవరం, గుమ్మిడి సింహాచలం, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి ఎర్నాయుడు, ఎంపీడీవో భానుమూర్తి, పీఆర్ జేఈ గౌతం తదితరులు పాల్గొన్నారు.

పూడమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల గ్రామదేవత పూడమ్మతల్లి వనం గుడిని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ప్రసాద్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె వెంట జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

ముగిసిన జాతర మహోత్సవం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేగిడి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పాపురం గ్రామస్థుల ఇలవేల్పు బిల్లాడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా ముగిసింది. మూడురోజుల పాటు నిర్వహించిన మహోత్సవాల్లో చివరి రోజున ప్రత్యేక జాతర, రేలారేలా కార్యక్రమాలు నిర్వహించారు. రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీశ్, రేగిడి మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడిఅశోక్‌కుమార్, గురవాన ధనుంజయ్, ఉంగరాడ సర్పంచ్ చల్ల భూజంగరావు, తెలగ సంఘం రాష్ట్రనేత పి.వెంకట రామారావు, ఏపీవో హరినాథ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వీరభద్రుడికి 11 అడుగుల ప్రభ



సంతకవిటి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఆర్.పురంలో వీరభద్రుడి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి 11 అడుగుల వీరభద్రుడి ప్రభను గ్రామంలో ఊరేగించారు. మేడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వీరభద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వీరభద్రుడిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించండి

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శనరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల నిర్వహణ, సదుపాయాల కల్పన తదితర అంశాల్లో రాజకీయ పక్షాల నాయకులు, ప్రతినిధులు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ వీవీఆర్ జగన్నాథరావు పాల్గొన్నారు.

జరజాపుపేటకు సత్యసాయి రథం

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలోని జరజాపుపేటకు మంగళవారం సత్యసాయి రథం చేరుకుంది. సత్యసాయి సేవామండలి ప్రతినిధులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. జరజాపుపేట ముఖద్వారం రాజబంగారమ్మ తల్లి ఆలయం వద్ద రథానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ అదట్రాపు రామారావు, సేవా సమితి ప్రతినిధులు, సంఘం జిల్లా ప్రతినిధులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శృంగవరపుకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించింది. స్థానిక సాయిబాబా ఆలయం నుంచి దేవిబొమ్మ కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో డీసీసీ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గేదెల తిరుపతి, జిల్లా కార్యదర్శి హెచ్.నానాజీ మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేస్తుండటంతో సంవిధాన్ బచావో అభియాన్ పేరిట ర్యాలీలు చేపడుతున్నామన్నారు. ఈనెల 20 జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల హజరవుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అభినందనలు

శృంగవరపుకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉద్యోగులను డిపో మేనేజర్ కె.రమేశ్ అభినందించారు. మార్చి నుంచి ఏప్రిల్ వరకు ఫిర్యాదులు లేకుండా ఉత్తమ సేవలు అందించిన కండక్టర్ జి.వి.రమణ, కె.అచ్చియ్యమ్మ, జె.దేముడు, ఎల్.జె.నాథం, బి.నిర్మల, డ్రైవర్లు పి.ఎస్.నాయుడు, బి.ఎస్.రాజు, ఎల్.అప్పారావు, ఓ.బి.రాజులకు నగదు పురస్కారాలను డిపో మేనేజర్ అందజేశారు.

శాస్త్రీయ ఆధారాల సేకరణే కీలకం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నేర స్థలం నుంచి దర్యాప్తు అధికారులు శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించడం, పరీక్షలకు ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపించడం కీలకమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులకు ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో మిమ్స్ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణకార్యక్రమాన్ని ప్రారభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపులో ఫోరెన్సిక్ నిపుణులు తెలియజేసిన మెలకువలను కేసుల దర్యాప్తులో వినియోగించాలన్నారు. నేరానికి పాల్పడిన వారికి శిక్ష పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో నేరం నిరూపించేందుకు అవసరమైన స్పష్టమైన ప్రశ్నలతో లెటర్ ఆఫ్ అడ్వయిజ్ ప్రిపేర్ చేసి పంపాలని ఫోరెన్సిక్ నిపుణులు అధికారులకు సూచించారు. అనంతరం వర్క్‌షాపులో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు వి.ప్రియాంక, ఎం.సుమాలిక, ప్రశాంతి, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పాపురంలో కల్యాణమండపం ప్రారంభం

రేగిడి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో అప్పాపురంలో రూ.75 లక్షల గ్రామస్థుల విరాళాలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని మంగళవారం రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీశ్ ప్రారంభించారు. బిల్లాడమ్మ గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా భక్తులంతా కల్యాణ మండపాన్ని గ్రామస్థులు అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, గురవాన ధనుంజయ రావు, ఉంగరాడ సర్పంచ్ చల్ల భూజంగరావు, శాసపు జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రాజాం, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కరించేందుకే ప్రతి వారం ప్రజాదర్బార్ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నిర్వహిస్తున్నారని టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలు వారి సమస్యలు చెప్పుకునేందుకు రాజాం పార్టీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి మండల కేంద్రంలో వారానికి ఒక రోజు ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. వచ్చే ఐదేళ్లలో రాజాం నియోజకవర్గాన్ని మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతారన్నారు. ఆయనతో పాటు నాయకులు గురవాన నారాయణ రావు, కిమిడి అశోక్‌కుమార్, కొంపిళ్ల రవి, దూబ ధర్మారావు పాల్గొన్నారు.

రోడ్డులో చెత్త వేయొద్దు



శివరామరాజుపేట రోడ్డుపై చెత్తాచెదారాలు

శృంగవరపుకోట, మే 6 (ఆంధ్రజ్యోతి): శివరామరాజుపేట రోడ్డులో చెత్తను వేయవద్దని స్థానిక పంచాయతీ అధికారులను వాకర్స్ కోరారు. మంగళవారం ఉదయం ఈ రోడ్డులో వాకింగ్ చేస్తున్న ఎస్.కోట ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.త్రినాథరావు, రిటైర్డ్ హెచ్‌ఎం నిరుజోగి హరి, నాగరాజు తదితరులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఎస్.కోట నుంచి శివరామరాజుపేట వరకు నిత్యం ఎంతో మంది ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారన్నారు. ఆహ్లాదం కోసం వాకింగ్‌కు వస్తే ఈ వ్యర్థాలు అసహనం కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పక్కనే చెత్త పారబోయడాన్ని నిలువరించాలని కోరారు.

వ్యాన్, బైక్ ఢీ: ఒకరి మృతి

జి.సిగడాం, మే 6(ఆంధ్రజ్యోతి): ఉల్లివలస కూడలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పూతికవలసకు చెందిన గురాన అప్పలనాయుడు(37) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాజాం నుంచి విశాఖపట్నం వెళుతున్న లగేజీ వ్యాన్, చీపురుపల్లి నుంచి పూతికవలసకి వెళు తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తన స్వగ్రామం పూతికవలస ద్విచక్రవాహనంపై వెళుతున్న అప్పలనాయుడుని వ్యాన్ బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ రాజాం మండలం కొరాఠిపురానికి చెందిన గిరిజాల ఈశ్వరరావుగా గుర్తించారు. కేసు నమోదు చేశాయని ఎస్ఐ తెలిపారు.

పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి

వేపాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి రెవెన్యూ చామలాదేవి అగ్రహారం సమీపంలో పేలుడు పదార్థాల నిల్వ కేంద్రాన్ని మంగళవారం ఆర్డీవో కీర్తి పరిశీలించారు. గ్రామస్థులు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పేలుడు పదార్థాల స్టాక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రావాడ వెంకట్రావు తదితరులు ఆర్డీవోతో మాట్లాడారు. వాయిలపాడు, చామలాదేవి అగ్రహారం గ్రామాలకు మధ్యలో పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం ఉన్నందున ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జనం ఆందోళన చెందుతున్నారన్నారు. దానిపై ఆర్డీవో మాట్లాడుతూ ఇక్కడి కేంద్రం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు ఉన్నాయన్నారు. నిబంధనల ప్రకారం ఇన్నర్ రేడియేషన్ 236 మీటర్లు, అవుటర్ రేడియేషన్ 471 మీటర్లు ఉందన్నారు. అయినప్పటికీ నిల్వ కేంద్రానికి ఆయా గ్రామాలు ఎంతదూరం ఉన్నాయో గూగుల్, డ్రోన్ కెమెరాల ద్వారా తెలుసుకోవడమే కాకుండా అనుమతులు జారీలో ఎటువంటి పొరపాట్లు జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలనలో తహసీల్దారు జె.రాములమ్మ, డిప్యూటీ తహసీల్దారు కె.సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులున్నారు.

అప్పుల బాధ తాళలేక..

● పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన హరీష్

గంట్యాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండతామారాపల్లి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన వసాది హరీష్ (30) విజయనగరం పట్టణంలో నివాసం ఉంటూ ఈనెల 5న అరుకులో ఉద్యోగానికి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మండలంలోని కొండతామారాపల్లి వద్దకు వెళ్లేసరికి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదుట మామిడితోటలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు ఇంటికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూసే సరికి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే జిల్లా కేంద్రానికి హరీష్‌ను తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడు హరీష్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల్లో దాదాపు రూ.15 లక్షలు అప్పులు కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● పుస్తెలతాడు రికవరీ

రాజాం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును తెంచుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి నుంచి రెండు తులాల పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నామని రాజాం ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బాబానగర్ రెండోనగర్‌లో నివాసం ఉంటున్న పేర్ల లక్ష్మి మెడలో నుంచి పుస్తెలతాడును ఈ ఏడాది జనవరి 23న కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన గరికి సుబ్బరాజు తెంచి పరారయ్యాడన్నారు. రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించామన్నారు. మంగళవారం రాజాంలోని నవ్యనగర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సుబ్బరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేశామన్నారు. పుస్తెలతాడును తెంచుకెళ్లిన కేసులో నిందితుడు అని గుర్తించి ఆభరణాన్ని రికవరీ చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరు పరిచామన్నారు. సుబ్బరాజుపై పలు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులున్నాయని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి

జియ్యమ్మవలస/ వీరఘట్టం, మే 6 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలో తురకనాయుడువలస, ఇటిక గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరఘట్టం మండలంలోని తూడి గ్రామ రెవెన్యూ అధికారి, వనజ గ్రామానికి చెందిన నిమ్మక విజయానంద్ (48) మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పార్వతీపురంలో విజయానంద్ నివాసం ఉంటున్నాడు. వనజలో సోమవారం విజయానంద్ ఓ శుభ కార్యానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం తన భార్య, పిల్లల దగ్గరకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో తురకనాయుడువలస, ఇటిక గ్రామాల మధ్య వాకింగ్ చేస్తున్న యువకుడు గొర్లి సురేష్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఆ సమయంలో అదుపు తప్పి బైక్ హ్యాండిల్‌లో తలఉండిపోవడంతో అక్కడికక్కడే విజయానంద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జియ్యమ్మవలస ఎస్ఐ ఎం.ప్రశాంత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన సురేష్‌ను 108పై ఆసుపత్రికి తరలించారు. విజయానంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. విజయానంద్‌కు నిమ్మక భారతి, నిమ్మక సునీత ఇద్దరు భార్యలు, మానస, కీర్తన, గీతిక ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఈయన తన భార్యలు, పిల్లలతో పార్వతీపురంలోని వాసం ఉంటున్నారు. వనజ గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. తూడి వీఆర్వో విజయానంద్ మృతి చెందడంతో తహశీల్దార్ సీహెచ్.సత్యనారాయణ, వీఆర్వోలు సంతాపం తెలిపారు.

గ్రామదేవత ఉత్సవాలకు వెళ్తూ..

మక్కువ, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెముడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మంగళవారం వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సాలూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కలిగి అప్పలనాయుడు (60) బొబ్బిలి పట్టణం గొల్లపల్లిలో గ్రామదేవత ఉత్సవాల కోసం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. చెముడులో తమ బంధువులు వంటి పత్తిగొల్లి సరస్వతి, మరొవ్యక్తిని ఎక్కించుకొని మక్కువ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో మరో ద్విచక్ర వాహనంపై మక్కువ నుంచి చెముడు వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వస్తు న్నాయి. ఆ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడ మృతి చెందాడు. వెనుక కూర్చొన్న సరస్వతికి, ఆమె మనుమడికి, ద్విచక్ర వాహనచోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. అప్పల నాయుడు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అప్పల నాయుడు భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


నెల్లిమర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం దేవుని కణపాకలో మంగళవారం చేపట్టిన దాడిలో దెయ్యాల చెరువు ప్రాంతంలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీలు ఎం.అప్పారావు, కానిస్టేబుళ్లు డి.కె.శంకర్, కూర్మారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారన్నారు.

జీవో నెంబరు 77ను రద్దు చేయండి

●కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నిరసన

విజయనగరం కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 77ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలంటూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రూపొందించిన జీవో వల్ల ప్రైవేటు కళాశాలల్లో పీజీ విద్యార్థులకు శాపంలా పరిణమించిందన్నారు. దీన్ని గతంలో ఎన్నోసార్లు తాము వ్యతిరేకించామన్నారు. ఎన్నికల ముందు పాదయాత్ర నిర్వహించిన లోకేశ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్తే, అధికారంలోకి వచ్చిన తరువాత జీవో 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 328 రోజులు గడిచినా జీవో రద్దుపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. వెంటనే జీవో రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విద్యాశాఖ మంత్రి లోకేశ్ దిష్టి బొమ్మను సంఘ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి కుమార్, వంశీ, కృష్ణ, చాణక్య, నాని పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

విజయనగరం క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల కోసం కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్మికులకు న్యాయ సలహాల కోసం 15100కి ఫోన్ చేయవచ్చునన్నారు. కార్మికులకు, కర్షకులకు న్యాయ సహాయం అందించడానికి సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి శ్రీనివాస్, సంస్థ సభ్యులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

దత్తిరాజేరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గేదెల సింహాద్రప్పల నాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపీడీవో వై.వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అమ్మో మలేరియా!

(5వ పేజీ తరువాయి)

లేనట్లు తెలుస్తోంది. దీంతో జ్వరపీడితులు సీతంపేట, పాలకొండ, కొత్తూరు ప్రాంతాల్లోని ప్రైవేట్ క్లీనిక్‌లను ఆశ్రయి స్తున్నారు. ఇదే అదునుగా కొంత మంది క్లీనిక్ నిర్వాహకులు రక్త పరీక్షలు, ఖరీదైన మందుల పేరుతో గిరిజ నులను నిలువునా దోచేస్తున్నారు. మరోవైపు సంచి వైద్యులు గిరిశిఖర గ్రామాల్లోని జ్వరపీడితుల ప్రాణా లతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలున్నాయి.

సీజన్‌కు ముందే..

ఏటా మే 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు అపెడమిక్ సీజన్ నడుస్తోంది. కానీ ఈ ఏడాది మాత్రం ఏప్రిల్ 20 నుంచే సీజన్ ప్రారంభమైంది. మలేరియా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.ఇప్పుడే ఇలా ఉంటే విస్తారంగా వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. కాగా మలేరియా వచ్చిన అత్యధికుల్లో తెల్ల రక్తకణాల సంఖ్య క్రమేపి తుగ్గముఖం పడుతుండడం ఆందోళనకు గురి చేస్తుంది. సాయంత్రమైతే చాలు చలిజ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో రోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

దోమతెరలు ఇచ్చేదెప్పుడో?

2021 తర్వాత ఇప్పటివరకు దోమతెరలు పంపిణీ జరగలేదు. దీంతో గిరిజనులు దోమకాట్లకు గురై జ్వరాలబారిన పడుతున్నారు. సీతంపేట మన్యంలో 45,429వేల దోమతెరలు అవసరమని అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి ఇండెంట్ పంపించారు. వాటిలో 8,032 దోమతెరలను గిరిజనసంక్షేమ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. అయితే అవి ఈ ఏడాది ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పర్యవేక్షణ లేక.. అభివృద్ధికి నోచక..

(5వ పేజీ తరువాయి)

కుమ్మరిగుంట, గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర, పార్వతీపురం పట్టణ పరిధిలోని కొత్తవలసలో భూములున్నా.. ఆలయం కనీస అభివృద్ధికి నోచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సత్యనారాయణ స్వామి ఆలయ గర్భగుడి వరకు బాగానే ఉన్నా.. దాని ప్రాంగణంలోని గదులు మాత్రం పూర్తి శిథిలావస్థకు చేరాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీంతో భక్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా దేవదాయ శాఖ మేలుకోవాల్సి ఉంది. సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించి.. దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేవాలయ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి, ఎంత ఆదాయం వస్తుందనే అంశాలపై దృష్టి సారించి.. ప్రముఖ ఆలయాలకు పూర్వ వైభవం తేవాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలువలకు మరమ్మతులు చేయండి

- తోటపల్లి నుంచి ఆయకట్టుకు నీరివ్వాలి
- పాలకొండలో రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ, మే6 (ఆంధ్రజ్యోతి):కాలువలకు మరమ్మతులు చేసి తక్షణమే తోటపల్లి నుంచి ఆయకట్టుకు నీరివ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్‌చేశారు.ఈమేరకు మంగళవారం పట్టణంలోని దుర్గగుడి సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదాసు మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం, జీఎంవలస మండలాల్లో దాదాపు 33 గ్రామాల పరిధిలో 8,550 ఎకరాల తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టుకు కొద్దేళ్లుగా నీరందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పెద్దబుడ్డిడి వద్ద సైఫాన్ పాడైనా ఇంతవరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిప త్రం అందించారు.ధర్నాకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, వ్యవసాయ సంఘ నాయకులు దూసి దుర్గారావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతు సంఘం నాయకులు ఇద్దుబోయిన సింహాద్రి, గంగుల శ్రీనివాస్,బోనుమంతుల సోమశేఖర్, కరణంరవి, దుప్పాడ గౌరు నాయుడు, రౌతు స్వామిబాబు, పడాల రామచం ద్రరావు, వెన్నపు నారాయణరావు, కోండ్రు సింహాచలం, సంగంనాయుడు, నారాయణరావు, గుంటుపల్లి కృష్ణ, అప్పన్న, సత్యారావు, శంకరరావు, నరసింహపాణి గ్రాహి పాల్గొన్నారు.

మునిసిపల్ సమావేశాలు నిర్వహించండి

పార్వతీపురంటౌన్ మే 6(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ సాధారణ, బడ్జెట్ సమావేశాలను ఎన్నికల కోడ్ వల్ల వాయిదాపడడంతో ఈనెలలో నిర్వహించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బి. గౌరీశ్వరీ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లను కలిశారు. రాజకీయాలకతీతంగా మునిసిపాలిటీ అభివృద్ధి కోసం ఆలోచించాలని, చాలారోజులుగా సాధారణ సమావేశం నిర్వహించకపోవడంతో పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని కమిషనర్‌కు వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరుకు బడ్జెట్ సమావేశం నిర్వహించాలని తెలిపారు. అవసరమైయితే కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్‌పై చర్చించాలని కోరారు. కాగా త్వరలోనే సాధారణ, బడ్జెట్ సమావేశాల నిర్వహణకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరీశ్వరీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియడంతో సాధారణ, బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు అవకాశమున్నా, కమిషనర్ మునిసిపల్ చట్టాలకు వ్యతి రేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈసారి సమావేశాలు నిర్వహిం చకపోతే ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అమరావతికి విద్యార్థుల ప్రయాణం

పార్వతీపురం, మే 6(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గిరిజన ఆశ్రమపాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో పదోతరగతిలో 564 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు,ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం అమరావతి బయలుదేరి వెళ్లారు. విద్యార్థులతోపాటు గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో శతశాతం ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు, గురుకుల ప్రిన్సిపాళ్లను బుధవారం రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్,మంత్రి సంధ్యారాణి అభినందించనున్నారు. వీరితోపాటు ప్రభుత్వజూనియర్, గురుకుల కళాశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు, ప్రిన్సిపాళ్లను కూడా మంత్రి అభినందించనున్నారు. కాగా పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచూపిన విద్యార్థులు, శత శాతం ఫలితాలు సాధించిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల ప్రిన్సిపాళ్లను మంత్రి లోకేష్ అభినందించనున్నారని డీడీ కృష్ణవేణి చెప్పారు.

రావుపల్లిలో ఘట్టాలమ్మ వారాలు

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుపల్లిలో ఘట్టాలమ్మ తల్లి వారాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నాలుగో తేదీ నుంచి వారాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ముగింపు ఉత్సవాలు పురస్కరించుకుని పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

పాలకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ చంద్రమౌళి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సింగనవలస జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రయోగమూర్తి పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి సహకరించండి

సాలూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీకి సహకరించాలని కొత్తవలస పంచాయతీ కార్యదర్శి ఎర్రాన్నాయుడు కోరారు. కొత్తవలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద మంగళవారం చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.చెత్తను విచ్చలవిడిగా ఎక్కడక్కడే పారబోస్తే వ్యాధులు ప్రబలుతాయన్నాయని తెలిపారు.



పింఛన్ అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం పట్టణంలో ఇటీవల 6,16,18 వార్డులలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదలకు భద్రత కల్పిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతిలబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందించడమే ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నూతి రాజేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోనపోలమ్మ అమ్మవారికి పూజలు

మక్కువ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన పంచాయతీ పరిధి గోపాలపురంలో గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా కోన పోలమ్మ అమ్మవారిని రాష్ట్ర స్త్రీ, శిశు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల నాయుడు, బొత్స కన్నంనాయుడు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



విద్యార్థులను అభినందిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆకాంక్షించారు. మంగళవారంగుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఈవో ఎన్‌టీ నాయుడు, డిప్యూటీ డీఈవో జ్ఞానప్రకాష్, ఏటీడబ్ల్యువో సురేష్, విద్యా కమిటీ చైర్మన్ శొంఠ్యాన రాజేష్, ఎంఈవో-1 చంద్రశేఖర్, ఎంఈవో-2 భీముడు, మండలంలోని 13 పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదనపు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కృషి

- పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం, మే 6 (ఆంధ్రజ్యోతి): అదనపు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మంగళవారం వీరఘట్టం పంచాయతీ సమస్యలపై ఈవో పి.కోటేశ్వరరావుతో చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని కోరారు.డౌన్‌స్ట్రీట్ తాగునీటి ఇబ్బందులుతొలగించేందుకు ప్రణాళికలుతయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరఘట్టం పట్టణ సమస్యపై ప్రత్యేకంగా దృష్టిసారించి ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

సర్వేలు పక్కాగా నిర్వహించాలి

- వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

మక్కువ, మే 6 (ఆంధ్రజ్యోతి):ప్రజారోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం మక్కువ, సంబర పీహెచ్‌సీల్లో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సంబంధించి ఇంటింటా సర్వే, గర్భిణుల నమోదు,కాన్పు వివరాలు, కుటుంబ నియంత్రణ, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు వివరాలు ఎప్పటికప్పుడు నమోదుచేయాలన్నారు. బాల్యంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల క్రమంలో ఆరోగ్య సమస్యలు, లోపాలు ముందుగానే గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో జ్వరాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదని, ఫీవర్ సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. దోమలనివారణకు కొనసాగుతున్న ఐఆర్‌ఎస్‌కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలన్నారు.గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే సత్వరమే ఆశాకార్యకర్తలు తెలియజేయాలన్నారు.ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సికిల్‌సెల్ వ్యాధిగ్రస్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరు, ఆరోగ్య కార్యక్రమం అమలుపై సమీక్షించారు. నివేదికలు, ఆశ సర్వే, రికార్డులు పరిశీలించారు.కార్యక్రమంలో మక్కువ,సంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు జి.హరికృష్ణ, ఎంవీ కిరణ్‌కుమార్, ఎపిడమిక్ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

9,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కురుపాం,మే6(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దుల్లో మన్యం జిల్లా ఎక్సైజ్ ఆధ్వర్యంలో సారా తయారీ కేంద్రాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దులోని కెరడ,వనజ, వలవ, సుళవ తదితర గ్రామాల్లో ముందస్తు సమాచారం మేరకు స్టేట్ టాస్క్‌ఫోర్స్, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు,సిబ్బందితో దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో సారా తయారు చేయడానికి 45 డ్రములతో ఉంచిన 9,500 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం చేశామని చెప్పారు. 460 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

దారిమల్లి సమీపంలో 250 లీటర్ల బెల్లం ఊట..

సీతంపేట రూరల్,మే 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని దారిమల్లి సమీపంలోని మల్లమ్మకొండపైఎస్‌ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో నిర్వహించినదాడుల్లో 250 లీటర్ల పులిసిన బెల్లం ఊటను గుర్తించి నాశనం చేశారు. సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో కలిసి బెల్లం ఊట గుర్తించి ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

కృష్ణపల్లిలో ఆటో బోల్తా

పార్వతీపురం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కృష్ణపల్లిలో కూలీలతో పెదమరికి నుంచి కారాడవలస వెళ్తున్న ఆటో మంగళవారం బోల్తాపడింది.దీంతో పలువురికి గాయాలు కావడంతో వెంటనే జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

విద్యతోనే మహిళలకు గౌరవం

- ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి



భామిని: మాట్లాడుతున్న చిన్మయిదేవి

భామిని, మే 6 (ఆంధ్రజ్యోతి):విద్యతోనే మహిళలకు సమాజంలో గౌరవం దక్కుతుందని ఐసీడీఎస్ ఆర్‌జేడీ చిన్మయిదేవి తెలిపారు. మంగళవారం భామిని అంగన్‌డీ కేంద్రాన్ని సందర్శించి కిశోరి వికాస్ కార్యక్రమంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంబాలికల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని,వారి హక్కులు, ఆరోగ్యంపై కౌమారదశలోనే అవగాహన కల్పించాలని కోరారు. కౌమార దశలోనే బాలికలకు ఆరోగ్యం, విద్య పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం కిశోరి బాలికల వికాసం సెలవుల్లో జూన్ పదో తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, సీడీపీవో పి.రంగలక్ష్మి, మహిళా పోలీసు చందన పాల్గొన్నారు.

- సీతంపేట రూరల్,మే 6(ఆంధ్రజ్యోతి): సోమగండిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు ఇస్తున్న శిక్షణను ఆర్‌జేడి చిన్మయిదేవి పరిశీలించారు. కిశోరి బాలికలు ప్రతిరోజూ తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె వెంట పార్వతీపురం మన్యంజిల్లా పీడీ కనకదుర్గ, సీడీపీవో రంగలక్ష్మి ఉన్నారు.

బుక్కూరులో కిశోరి వికాసం

పాలకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బుక్కూరు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సిమ్మాలమ్మ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి ప్యాడ్స్ వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.శ్రీధర్, ఔట్రీచ్ వర్కర్ ఆర్.హరికృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ ఎన్.హిమప్రభ, టి.దివ్య పాల్గొన్నారు.

కిశోరి బాలికలు జాగ్రత్తలు పాటించాలి

సాలూరురూరల్, మే6(ఆంధ్రజ్యోతి):కిశోరి బాలికలు శారీరక,మానసిక మార్పులకు ఆందోళనకు చెందకుండా జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సాలూరు సీడీపీవో విజయలక్ష్మి పిలుపునిచ్చారు.మంగళవారం అన్నంరాజువలసలో కిశోరి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కిశోరి బాలి కలు ఆకర్షణకు లోనకాకుండా ఉండాలన్నారు. బంగారు భవిష్యత్‌ను నిర్మించు కోవడానికి పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వారు పాటించాల్సిన జాగ్రత్తలు, నిర్వహించాల్సిన పరిశుభ్రత కార్యక్రమాలను సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుమ్మలక్ష్మీపురం, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తవలసలో ఎస్‌సొసైటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వ్యాసరచన, డిబేట్ పోటీలను మంగళవారం నిర్వహించారు విజేతలకు ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ బహుమతులు అందించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయాలు గిరిజన యువత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కొత్తవలస యువత, మాజీ సర్పంచ్ కమలమ్మ, ఉపాధ్యాయులు చిన్నారావు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో పనులు



ఎక్స్‌కవేటర్‌తో పారిశుధ్య పనులు చేయిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సాలూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో మూలనపడి ఉన్న ఎక్స్‌కవేటర్ ఎట్టకేలకు రోడ్డు ఎక్కింది. సాలూరు మునిసిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా పడిఉంది. ఈ నేపథ్యంలో 'వీటిని వినియోగించరు!' శీర్షిక ఆంధ్రజ్యోతి మంగళవారం కథనం ప్రచురితంకావడంతో మునిసిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌కు చోదకుని ఏర్పాటు చేశారు. దీంతో ఎక్స్‌కవేటర్ పారిశుధ్య పనులకు వినియోగించారు. మునిసిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్‌తో గాంధీనగర్, దాసరివీధి తదితర చోట్ల కాలువల్లో పూడికలు, చెత్త తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు.

9న పార్వతీపురంలో జాబ్‌మేళా

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగయువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల తొమ్మిదో తేదీన పార్వతీపురం బాస్కర డిగ్రీ కళాశాల ఆవరణలో ఎంఎస్‌ఎంఈ స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవకాశాలపైజాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. పదోతరగతి పైబడిన వారు అవ కాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

పాలకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లి గ్రామానికి చెందిన పల్లి అప్పలనరసమ్మకు కుడికాలు మోకాలి మార్పిడి శస్త్రచికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.50 వేలు మంజూరయ్యింది. ఈమేరకు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కును అప్పలనరసమ్మ కుమారుడు పల్లి లక్ష్మీనాయుడుకు అందించారు.ఆయనతో పాటు కర్నేల గణేష్ ఉన్నారు.

సమీకృత దాణా పంపిణీ

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 50రాయితీపై సమీకృత దాణా పంపిణీచేయనున్నట్లు మండల పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుపురేషన్‌కార్డు ఉన్న పాడి రైతులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణాను అందజేయనున్నట్లు చెప్పారు. భారత్ పశుధన్ యాప్‌లో రైతులకు సంబంధించిన పేర్లు నమోదై ఉండాలని, రైతుసేవా కేంద్రంలో లేదా పశు సంవర్ధకశాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు.50 కిలోల సమీకృత దాణా బస్తా రూ. 1100లు కాగా ప్రభుత్వ సబ్సిడీ పోను రూ. 550లు రైతులు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతుకు ఒక బస్తాను మాత్రమే అందజేస్తామని తెలిపారు.

గరుగుబిల్లిలో వైద్య సిబ్బంది నిరసన



గరుగుబిల్లి:పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, సూపర్ వైజర్లపై అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఎంఎల్‌పీహెచ్‌లు తమ హక్కుల కోసం ధర్నా చేయడం తప్పుకాదని, మిగిలిన క్యాడర్లను కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. ఏఎన్‌ఎంలకు రూ. 50 వేలు, ఏబీసీడీలు రాని సూపర్‌వైజర్లకు రూ.70 వేలు ప్రభుత్వం వేతనాలు అందిస్తోందని, ఏఎన్‌ఎం అర్హత ఉన్న సూపర్‌వైజర్లకు లక్ష రూపాయలు మేర తీసుకుంటున్నారని విమర్శించడం మంచిది కాదన్నారు. తప్పుడు వ్యాఖ్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామనిని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.దుర్గాప్రసాద్, బి.చిన్నమ్మ, సీహెచ్ ఉదయకుమార్, ఏవీ రమణమ్మతో పాటు పలువురు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జీవో-143 రద్దు చేయాలి

పార్వతీపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలు తమ సమస్యల పరిష్కారం కోసం కొద్దిరోజులుగా నిరసన కార్యక్రమం చేపడుతున్న సందర్భంగా ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు జీవీఆర్‌ఎస్‌కిషోర్, వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది.మంగళవారం పార్వతీపురంలోని ఏపీ ఎన్‌జీవో హోంలో మన్యం జిల్లా మెడికల్ అండ్ హెల్త్ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలువ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని కోరారు. జీవో-143 రద్దుచేయాలని, వెంటనే బదిలీలు చేపట్టాలని, పెండింగ్ ప్రమోషన్స్ ఇవ్వాలని, యాప్‌లు తగ్గించాలని, ఫీల్డ్ స్టాఫ్‌కు ఎఫ్‌ఆర్‌ఎస్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు బి.చిన్నమ్మి, బి.పుష్ప, ఎస్.లలితకుమారి, జయలక్ష్మి, భవానీకె.రాణి, జ్యోతిలక్ష్మి,దుర్గాప్రసాద్, జయగౌడ్, పార్వతీ, రమణమ్మ తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు సుమారు 350 మంది పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు చర్యలు

- పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

గుమ్మలక్ష్మీపురం, మే 6(ఆంధ్రజ్యోతి): సచివాలయాల భవన నిర్మాణాల బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని సచివాలయ ఆర్‌బీకే, సచివాలయ భవనాలను పరిశీలించారు. ఈసందర్భంగాసర్పంచ్ గౌరీశంకరరావు మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వల్ల రెండేళ్లుగా బిల్లును చెల్లించడం లేదని ఇటీవల కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లామని సబ్ కలెక్టర్‌కు వివరించారు. దీంతో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005లో పదోతరగతి చదవిన వారంతా మంగళవారం ఆత్మీయ కలయిక కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వీవీఆర్ శర్మను, ఉపాధ్యాయులు ఎం.శశికుమార్, ఎం.అప్పలస్వామిలను వారంతా సన్మానించారు.

కనీస వేతనాలు అమలుచేయాలి

మక్కువ, మే 6 (ఆంధ్రజ్యోతి):ఆశ వర్కర్లపై పనిభారం తగ్గించి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. మంగళవారం మక్కువ, సంబర పీహెచ్‌సీల్లో ఆశావర్కర్లు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు అందించాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు.రిటైర్ అవుతున్న వారికి బెనిఫిట్స్, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సీహెచ్‌డబ్ల్యూలను ఆశాలుగా మార్చాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో ఆశ వర్కర్ల సంఘం నాయకులు లక్ష్మి, సీత, సీఐటీయూ మండల కార్యదర్శి జి.కృష్ణ పాల్గొన్నారు.

సమ్మెకు ఆశావర్కర్ల నోటీసు

సాలూరు రూరల్,మే 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్త సమ్మెలో ఈనెల 20న పాల్గొంటామని ఆశావర్కర్లు పీహెచ్‌సీల వైద్యాధికారులకు నోటీసులిచ్చారు.మంగళవారం మామిడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివకుమార్,తోణాం వైద్యాధికారి అక్యాన అజయ్‌లకు ఆశావర్కర్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వై నాయుడు ఆధ్వర్యంలో సమ్మె నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కనీస వేతనమివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమాల్లో రాజేశ్వరి,రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

గరుగుబిల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు కోరారు. మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు.